ప్రజలకనుగుణంగా పాలన ఉండాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఓల్డ్ గ్యాస్‌మండిలోని ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 24: ప్రజల అవసరాల కు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించా రు. బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ ఓల్డ్ గ్యాస్ మండిలోని ఆదయ్యనగర్ మెమోరియల్ స్కూల్‌ను తలసాని శ్రీనివాస్‌యాదవ్ వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా అదనపు తరగతి గదులను నిర్మించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. కాగా విద్యార్థులకు అనువుగా ఉన్న క్రీడా మైదానంలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే తలసానిని కలిసి కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తలసాని పాఠశాలను సందర్శించి స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా హైస్కూల్ మైదానంలో కాకుండా ప్రైమరీ స్కూల్ మైదానంలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని డిప్యూటీ డీఈవో చిరంజీవులు, హెచ్ఎం నారాయణరెడ్డిలను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఈఈ సుదర్శన్,ఇతర అధికారులు సంధ్య, భరత్, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేస్ బీనా పాల్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగంలో గ్రేస్ బీనా పాల్ డాక్టరేట్ సాధించారు. విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం. మాధవి పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ ది ఇన్‌సెక్టిసైడల్ ఎఫెక్ట్ ఆఫ్ డయాస్పైరోస్ క్లోరోక్సిలోన్ అండ్ మండులే సెరీషియా ఎగెనెస్ట్ స్పైరలింగ్ వైట్‌ఫ్లై, అలూరోడిసస్ డిస్పెర్సస్ రస్సెల్ (హోమోప్టెరా : అలీరోడైడ్)' పై పరిశోధన చేసి ఆమె సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఇన్నోవేటివ్ చాలెంజెస్ ఇన్ అప్లైడ్ యా స్పెక్ట్స్ ఆఫ్ జువాలాజికల్ సైన్సెస్' పై 2021 డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ సింపోజియంలో బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డును సాధించారు.

భారత రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలు

బన్సీలాల్‌పేట్ : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగంపై దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తు రామన్ ఆధ్వర్యంలో న్యూబోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

తెలంగాణ రాష్ట్రం మొదటి సీఎం , బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొందరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆశిస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ దేవాలయమైన కంబోడియాలోని అంగ్‌కోర్ వాట్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కరాటే రాజు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బీ – సెక్షన్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జనవరి 24 : డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని బీ – సెక్షన్‌లో జీహెచ్ఎంసీ అధికారులు, పార్టీశ్రేణులతో కలిసి సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇప్పటికే డివిజన్‌లో చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అదేవిధంగా పెండింగ్ పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, పార్టీ శ్రేణులు మహమ్మద్, ఎల్లయ్య, నర్సింగ్, వసంత, ఇస్మాయిల్, వడ్లూరి రవి, నరేష్, గోపి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బేగంపేట్, జనవరి 24: బేగంపేట్ మాతాజీనగర్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. వారం రోజులుగా మాతాజీ నగర్‌లో ఉప్పొంగుతున్న డ్రైనేజీ సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే బుధవారం వివిధ శాఖల అధికారులతో కలిసి మాతాజీ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సగం వరకు వేసిన పైపుపనులను పూర్తి చేస్తామన్నారు. స్థానిక సమస్యలను అధికారులు గుర్తించి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, జలమండలి సెక్షన్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు సురేశ్‌యాదవ్, శ్రీహరి, రాజయ్య పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

బన్సీలాల్‌పేట్, జనవరి 24 : పద్మారావు నగర్‌లోని శివానంద ఆశ్రమ మార్గంలో పోస్టల్ శాఖ కారణంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పద్మనాభ, సంజీవని అపార్ట్‌మెంట్ వాసులు కోరారు బుధవారం జలమండలి సీజీఎమ్ ప్రభు, డీజీఎమ్ కృష్ణ, జీహెచ్ఎంసీ డీఈఈ ఆంజనేయులు, ఏఈ నవీన్, బీఆర్ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌లతో కలిసి సమస్య ఉన్న ప్రదేశంలో పర్యటించారు. అనంతరం పోస్టల్ శాఖ స్టాఫ్స్ ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, ఏసూరి మహేశ్, ప్రేమ్‌కుమార్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, అమృత, కౌసల్య పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఏ) ఆధ్వర్యంలో బుధవారం గణతంత్ర దినోత్సవ పోస్టర్‌ను మంత్రి సీతక్క సచివాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళ అజయ్, ఎస్‌టీఎస్ఏ నాయకులు లింగంపల్లి మనోజ్, గుగ్గిళ్ల మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సికింద్రాబాద్,జనవరి 24: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ హేమ అన్నారు.బుధవారం జలమండలి సీతాఫల్‌మండి సెక్షన్ అధికారులతో కలిసి చిలకలగూడలో రూ. 2 లక్షల 60 వేల వ్యయంతో తాగునీటి నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.....డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అన్విత్‌తో పాటు నాయకులు కరాటే రాజు, శంకర్, నవీన్,రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కలిసి తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమ

అతివేగంతోనే.. ప్రాణనష్టం

ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎస్.రంగారావు

కంటోన్మెంట్, జనవరి 24: యువత వాహనాలను అతివేగంగా నడుపుతూ తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని నార్త్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎస్. రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాంతంలో రోజుకు కనీసం 20 మంది రోడ్డు ప్రమాదాల వల్ల మృత్యువాత పడుతున్నారని ఆయన తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ పీజీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, భారత ప్రభుత్వ క్రీడల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు మాట్లాడుతూ.. యువత ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా మితి మీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలని, లేని పక్షంలో మోటారు వాహన చట్టప్రకారం చలాన్‌తో పాటు తగిన శిక్ష ఉంటుందన్నారు. అనంతరం కళాశాల నుంచి పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ మధుసూదన్ రెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట్, మారేడ్‌పల్లి ట్రాఫిక్ సీఐలు పాపయ్య, రామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంసేవించి వాహనాలు నడపొద్దు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు, సిబ్బంది

బొల్లారం, జనవరి 24 : జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం తిరుమలగిరి రవాణాశాఖ కార్యాలయం ఎదుట వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మద్యం సేవించి,వాహనాలు నడపకూడదన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయకూడదన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు పాటిస్తూ.. హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ శత జయంతిని ఉస్మానియా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు కోదండరాం, భాగయ్య, కాశిం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఠాకూర్ సేవలను కొనియాడారు. ఆయన శత జయంతి సందర్భంగా భారతరత్న ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన వర్గాలకు తొలిసారిగా రిజర్వేషన్లు అమలు చేసి జననాయక్‌గా పేరుగాంచారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జనవరి 24 : ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, బీదర్‌లోని కొట్యాల్‌కు చెందిన శ్రీకాంత్ (25) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వెండర్. మద్యం మత్తులో సికింద్రాబాద్ – జెమ్‌స్ట్రీట్ రైల్వేస్టేషన్ల ట్రాక్ మధ్యలో నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహించాలి

బాలికల దినోత్సవంలో పలువురు వక్తలు

ఎస్పీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, బాలికలు

బన్సీలాల్‌పేట్/కంటోన్మెంట్/బొల్లారం, జనవరి 24 : పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో బుధవారం జాతీయ బాలికల రోజును నిర్వహించారు. రుద్రమదేవి విమెన్స్ వెల్ఫేర్ సొసైటీ, యాక్షన్ ఎయిడ్స్ సంస్థ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని తెలంగాణ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పి.సరోజిని దేవి, ఎస్పీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.హేమలత, యాక్షన్ ఎయిడ్స్ సంస్థ జాతీయ ప్రోగ్రామ్ మేనేజర్ బి.వందన, న్యాయవాది టి.సుభాషిణిలు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..బాలికలపై వివక్ష లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా నాణ్యమైన విద్యతో పాటు రక్షణ కల్పించాలన్నారు. అన్ని రంగాల్లో బాలికలు ఎదిగేవిధంగా ప్రోత్సహించాలని వక్తలు సూచించారు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేలా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ , నైపుణ్యాలను నేర్పించి స్వశక్తితో ఎదిగేలా చేయూతనివ్వాలన్నారు. బాలికలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను నిరోధించడానికి పోక్సో చట్టం అమలులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ సీఎస్ఆర్ హెడ్ శ్రీనివాస్, బ్రాంచ్ సేఫ్టీ హెడ్ షాలిని, షార్ట్ ఫిలిమ్ డైరెక్టర్ టి.శ్రీకాంత్, ఫిలిం ఫెస్టివల్ డైరెక్టర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బో లెర్నింగ్ సెంటర్‌లో ..

చాచా నెహ్రూనగర్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్ఐ ప్రోగ్రామ్స్ సిటీ కోఆర్డినేటర్ వి.క్రాంతికిరణ్ తదితరులు మాట్లాడుతూ బాలికలను గౌరవించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ సెంటర్ సిబ్బంది సంధ్య, వెంకట లక్ష్మి, పద్మ, అమన్‌వేదిక సిబ్బంది కళావతి, రాజు పాల్గొన్నారు.

జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారం రిసాల బజార్ ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బాలికలు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండో వార్డు రసూల్‌పురాలోని ఇందిరమ్మనగర్, గన్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, స్కెచ్ పెన్నులను టీఎన్ శ్రీనివాస్ అందజేశారు.కార్యక్రమంలో నేతలు దేవులపల్లి శ్రీనివాస్, కుమార్ ముదిరాజ్, శ్యామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట: రెయిన్‌బో లెర్నింగ్ సెంటర్‌లో..

బొల్లారం రిసాల బజార్ ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

మహేశ్ (ఫైల్)

బేగంపేట్, జనవరి 24: తల్లితో పాటు ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ కిషన్ తెలిపిన కథనం ప్రకారం..సికింద్రాబాద్ బజార్‌కు చెందిన మహేశ్ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 19న వారు బంధువుల ఇంటికెళ్లాలని సికింద్రాబాద్ 31 బస్‌స్టాప్‌లో తల్లితో కలిసి 23 బి భూదేవినగర్ బస్సు ఎక్కారు. భూదేవినగర్‌కు చేరుకున్నాక బస్సులో తన కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇండ్లల్లో వెతికినా మహేశ్ జాడ తెలియలేదు. బుధవారం మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లాక్‌టవర్ వద్ద ఘర్షణ

- ముగ్గురికి తీవ్రగాయాలు

బేగంపేట్, జనవరి 24: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా ఓ వ్యక్తి పరారయ్యాడు. ఈ ఘటన సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకున్నది. మార్కెట్ పీఎస్ పోలీసుల కథనం ప్రకారం.. మధ్యాహ్నం టోలీ చౌకికి చెందిన అబిద్‌ఖాన్,ఫయాజ్ ఖాన్ ఫుట్‌పాత్‌పై ఉండే మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించారు. క్లాక్‌టవర్ సమీపంలోని చర్చి వద్ద ఒకరిపై ఒకరు దాడికి దిగారు. గొడవ పెద్దది కావడంతో రాళ్లు, కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో అబిద్‌ఖాన్, ఫయాజ్ ఖాన్, రాజు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని చికిత్స నిమిత్తం 108లో గాంధీ దవాఖానకు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సీడీఎఫ్‌డీని సందర్శించిన విద్యార్థులు

సిటీబ్యూరో, జనవరి 24(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌ను పలు కళాశాల విద్యార్థులు సందర్శించారు. బుధవారం నారాయణగూడలోని ఆర్‌బీవీఆర్ కాలేజీ, బేగంపేట్‌లోని గీతాంజలి పాఠశాలల విద్యార్థులు పర్యటించారు. సీడీఎఫ్‌డీ ప్రాంగణంలో ఉన్న ల్యాబోరేటరీలు, జరిగే పరిశోధనలు, బయోటెక్నాలజీ రంగంలో ఉన్న అవకాశాలు, వృత్తి నైపుణ్యాలపై ఈ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో సైన్స్ రంగంపై అవగాహన, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా సందర్శనకు అనుమతినిస్తున్నట్లు సీడీఎఫ్‌డీ వర్గాలు పేర్కొన్నాయి.

కంటోన్మెంట్: గన్‌బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెన్నులను పంపిణీ చేస్తున్న బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్